ప్రజాశక్తి
బుధవారం 27 సెప్టెంబర్ 2023
5
శ్రీ సత్యసాయి

జగన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అందరికీ 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సర్వే పరీక్షల ద్వారా గుర్తించిన ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మరింత మెరుగైన వైద్యం అందించనున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి గ్రామంలో పైలట్ ప్రోగ్రామ్‌గా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటుచేసిన పలు విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పై ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో ఎదురయ్యే లోటుపాట్లను గుర్తించి ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డా॥కృష్ణారెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, డిసిహెచ్ఎస్ డా॥తిపేంద్ర నాయక్, మండల స్పెషల్ ఆఫీసర్ డా॥శుభదాస్, ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచి లక్ష్మీనరసమ్మ, తహశీల్దార్ నవీన్, ఎంపీడీవో అశోక్, జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మతో పాటు వివిధ శాఖల అధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో పంట నమోదు : కలెక్టర్

జిల్లాలో పంటల సాగుకు సంబంధించిన ఈ-క్రాప్‌ను క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే వాటి వివరాలను యాప్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. పంట సాగుకు సంబంధించి గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ అధికారి బయోమెట్రిక్ వేసి దానిని ధ్రువీకరించాల్సి ఉంటుందన్నారు. మంగళవారం నాడు పుట్టపర్తి మండలంలోని బ్రాహ్మణపల్లి, జీడిపల్లి, జగరాజుపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈక్రాప్ నమోదును ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. పొలం విస్తీర్ణం వారీగా పంటల వివరాలను అప్లోడ్ చేసి బయోమెట్రిక్ ధ్రువీకరణ చేయాల్సి ఉంటుందన్నారు. నమోదు చేసిన పంటల వివరాలకు ఈ కేవైసీ, అధికారుల పరిశీలన అనంతరం రైతులకు డిజిటల్ మాన్యువల్ రసీదులను అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, తహశీల్దార్ నవీన్ కుమార్, పాల్గొన్నారు.

ఈ బిడ్‌పై కదలిక

- సిఐడి అన్వేషణ మొదలు
- ఆదాయం పేరుతో పెద్ద ఎత్తున టోకరా
- 2021లో ఉమ్మడి జిల్లాలో కోట్లలో మోసం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ-బిడ్ మోసంపై కదలిక మొదలైంది. ఈ పేరుతో 2021లో పెద్దఎత్తున వందల కోట్ల రూపాయలు మోసం చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణను సిఐడి వేగవంతం చేసినట్టు సమాచారం. డబ్బుల లావాదేవీలపై పూర్తి స్థాయి విచారణను కొనసాగిస్తోంది. ఎక్కడికెక్కడికి డబ్బులు బదిలీ అయ్యాయన్న దానిపై నిఘా పెట్టారు. దీనికై దేశంలోని వివిధ ప్రాంతాల్లో అన్వేషణ మొదలుపెట్టింది. దీంతో ఈ కేసులో కదలిక వచ్చినట్టు కనిపిస్తోంది.

లక్షకు రూ.30 వేలు ఆదాయమని నమ్మబలికి

లక్షకు రూ.30 వేలు ఆదాయం వస్తుందని నమ్మబలికి వందల కోట్లలో డబ్బులు వసూలు చేసి బోర్డును ఈ బిడ్ సంస్థ తిప్పేసింది. 2021వ సంవత్సరంలో ఈ రకమైన మోసం జరిగింది. ఆదాయం ఎక్కువగా వస్తుందని ఆశించి పెద్దమొత్తంలో డబ్బులను ఆ సంస్థ ప్రతినిధులకు చెల్లించారు. బయట అప్పులు చేసి మరీ పెట్టుబడి పెట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇందులో పెట్టుబడులు పెట్టారు. ఒక్క ధర్మవరం ప్రాంతంలోనే కొట్లాది రూపాయలు ఇందులో పెట్టారు. ధర్మవరంతో పాటు అనంతపురం నగరంలోనూ ఉద్యోగులు, వ్యాపారులు పెట్టుబడులు పెట్టారు. ఈ రకంగా పెట్టుబడులు పెట్టిన వారిలో పోలీసు సిబ్బంది కూడా ఉన్నట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. పెద్ద ఎత్తున పెట్టుబడులు సేకరించిన ఆ సంస్థ బోర్డు తిప్పేసింది. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ధర్మవరం, అనంతపురం ప్రాంతాల్లో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక పరమైన మోసం జరగడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశం అయ్యింది. వందల కోట్లు ఇందులో ఉండటంతో కేసును సిఐడికి బదిలీ చేశారు. అప్పటి నుంచి ఈ కేసు విచారణ కొనసాగుతున్నప్పటికీ అంత వేగంగా ముందుకు సాగలేదు.

విచారణ వేగంతం

విచారణ ప్రస్తుతం వేగవంతమైనట్టు కనిపిస్తోంది. సిఐడి అధికారులు దేశంలో వివిధ ప్రాంతాలకు విచారణ నిమిత్తం వెళ్లారు. నాగపూర్, ఢిల్లీ, పుణేల్లో కార్యాలయాలకు వెళ్లారు. అక్కడ కార్యాలయాలున్నట్టు అప్పట్లో సమాచారం ఉండటంతో వివరాల సేకరించేందుకు సిఐడి బృందాలు వెళ్లినట్టు సమాచారం. అక్కడి నుంచి బ్యాంకు ఖాతాలు ఆపరేట్ చేసినట్టు తెలియడంతో, ఆ వివరాలను సేకరిస్తున్నారు. ఏ ఖాతాలో నుంచి ఎక్కడికి డబ్బులు మారాయన్న వివరాలు సేకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఇది తేలాక అసలు నిందితులపై చర్యలుండే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

బాధితులకు ఊరట లభించేనా ?

తక్కువ సమయంలో లాభాలు వస్తాయన్న ఆశతో పెద్ద సంఖ్యలో డబ్బులు పెట్టుబడిగా పెట్టారు. అప్పులు చేసి మరీ పెట్టారు. పెద్ద మొత్తంలో నష్టపోయిన బాధితులు రెండేళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఆర్థికపరమైన నేరం కావడంతో విచారణ అనుకున్నంత వేగంగా సాగడం లేదు. సిఐడికి ఇచ్చినా విచారణ నెమ్మదిగా సాగుతూ వచ్చింది. ఇప్పుడిప్పుడూ దాని లోతుల్లోకి సిఐడి దిగుతుండటంతో పూర్తి స్థాయి డొంక కదిలితే కేసులో కదలిక వచ్చే అవకాశముంది. వచ్చి డబ్బులు కొంత వరకైనా బాధితులకు అందుతుందా అని ఎదురు చూస్తున్నారు. ఒకవేళ రివకరీ కొంత వరకైనా బాధితులకు ఎంతో ఊరట లభించే అవకాశముంది.

హిందూపురం, గుడిబండ, చిలమత్తూరు మండలాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీల ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు తలపెట్టిన మహాధర్నాను ప్రభుత్వం పోలీసుల ద్వారా ఉక్కుపాదం మోపి అణచివేయాలని ప్రయత్నించాన్ని నిరసిస్తూ స్థానిక అంగన్వాడీలు కదంతొక్కారు. ఈ మేరకు వారు మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పాడి నిరసన తెలిపారు. ఈ ఆందోళలనకు సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మద్దతు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలు పరిష్కరించమని అడిగితే వారిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటి అమలు చేయాలని, నాణ్యమైన ఆహార పదార్థాలను సరఫరా చేయాలని, హెల్పర్లకు, మినీ వర్కర్లకు ప్రమోషన్ ఇవ్వాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, నాయకులు నాగమ్మ, భారతి, శివమ్మ, ఫామిద, కల్లూరు ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నరేష్, అధ్యక్షులు రఫీక్, రమేష్‌తో పాటు పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుడిబండ : అంగన్వాడీల అరెస్టులను నిరసిస్తూ మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు గుడిబండ సిడిపిఒ కార్యాలయం ముందు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను వినిపించడానికి కూడా హక్కు లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలమత్తూరు : అంగన్వాడీల అరెస్టులను నిరసిస్తూ సిఐటియు ఆద్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు చిలమత్తూరులో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పండి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనంతలో పరిటాల సునీత దీక్ష భగ్నం

- అరెస్టు చేసి ఆసుపత్రికి తరలింపు
- పోలీసులు, ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పరిటాల సునీతను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ మాజీ మంత్రి పరిటాల సునీత అనంతపురంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఒక్క రోజు కూడా గడవక ముందే పోలీసులఖు అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ నాయకులు ఖండించారు. చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం నాడు అనంతపురం నగరం రూరల్ ప్రాంతంలోని జొన్నాబిరన్ మార్టు వద్ద నిరవధిక నిరాహారదీక్షకు పరిటాల సునీత కూర్చొన్నారు. మంగళవారం ఉదయాన్నే ఏడు గంటల సమయానికి పోలీసులు అక్కడికి చేరుకుని అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. దీన్ని పరిటాల సునీత, ఆమెకు మద్దతుగా కూర్చొన్న మహిళలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీక్షకు కూర్చొని 24 గంటలు కూడా గడవ ముందే పోలీసులు తనను అరెస్టు చేయడం ఏమిటని పోలీసులను సునీత నిలదీశారు. అరెస్టు చేస్తే తన మెడలోనున్న నల్ల టవల్‌తో గొంతుకు బింగించుకుంటానని బెదిరించారు. కొద్దిసేపు వెనక్కు తగ్గిన పోలీసులు తరువాత మెడలోని టవల్‌ను తొలగించి ఆమెను అరెస్టు చేసి అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ సమయంలో పోలీసులు, టిడిపి కార్యకర్తలకు మధ్య కొంతసేపు తోపులాట జరిగింది. తోపులాట నడమునే వాహనంలో ఆసుపత్రికి తరలించి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనంతరం సునీత డిశ్చార్జి అయ్యి ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును ఆమె ఎండగట్టారు. ఎటువంటి తప్పు చేయకున్నా తమ నాయకుడు చంద్రబాబును అరెస్టు చేసారని మండిపడ్డారు. దీనికి నిరసనగా దీక్షలు చేస్తే ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి వైసిపి ప్రభుత్వం తట్టుకోలేక అరెస్టులు చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే వైసిపి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని, చంద్రబాబు అరెస్టుతో ఆ పార్టీ మరింత దిగజారిందన్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, సత్యసాయి జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి ఆమెను పరామర్శించారు. టిడిపి నాయకులు శాంతియుతంగా దీక్షలు చేపట్టినా ప్రభుత్వం ఓర్చుకోలేకపోతోందన్నారు. పోలీసులను ఉపయోగించి అరెస్టులు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి

వ్యకాసం జిల్లా కమిటీ డిమాండ్

బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

మండల పరిధిలోని బూదిలి గ్రామంలో జాతీయ రహదారి కోసం ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామం లో ప్రధానంగా ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులు అందరూ దళితులే అని అన్నారు. ప్రభుత్వ అధికారులు సెంటు స్థలం రూ.16వేలు నిర్ణయించడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఏ నిబంధనలు ప్రకారం ధర నిర్ణయించారో అధికారులు చెప్పాలని ప్రశ్నించారు. బూదిలి రెవెన్యూ పొలంలో భూములు , ఇళ్ల స్థలాలు లక్షల రూపాయలు మార్కెట్ ధర పలుకుతున్నాయన్నారు. చట్టం ప్రకారం మూడు రెట్లు అదనంగా పెంచి ఇవ్వాల్సిన అధికారులు దళితుల పట్ల వివక్షతో తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పునరావాసం విషయం గురించి ఊసే లేదన్నారు. ఇప్పటికే రాజకీయ వివక్షతో గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూములు కోల్పోయిన దళితులకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం అధికారులు ఇస్తామన్న నష్టపరిహారంతో 10 అడుగుల స్థలం కూడా రాదని అన్నారు. దళితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారంతో పాటు పునరావసం కల్పించడంలో భాగంగా సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరిగేంత వరకు వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు పాల్గొన్నారు.

అరెస్టులతో పోరాటాలను ఆపలేరు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో విద్యార్థి ఉద్యమాలను ప్రభుత్వం ఆపలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి అన్నారు. విద్యారంగ సమస్యలతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా వసతిగృహాల విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్‌తో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆద్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని విద్యార్థులను, ఎస్ఎఫ్ఐ నాయకులను ఎక్కడిక్కడ ముందస్తు అరెస్టులు చేయడం విద్యార్థులపై లాఠీఛార్జీ చేయడం బాధాకరమని బాబావలి అన్నారు. దీనిని నిరసిస్తు ఎస్ఎఫ్ఐ ఆద్వర్యంలో పట్టణంలో అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుకునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ప్రభుత్వమే ఉచితంగా అందించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని కోరారు. చిత్త శుద్ధి ఉంటే సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని లేని పక్షంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హర్ష కుమార్, భగత్, ఇంతియాజ్, గణేష్, సల్మాన్, ఇమ్రాన్, అరుణ్, ప్రవీణ్, మనోజ్, మోమిన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వ్యాపారుల అభివృద్ధే తమ ధ్యేయమని ధర్మవరం పట్టుచీరల తయారీ వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు గిర్రాజు రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని సెమినారాయణస్వామి గుడిలో ధర్మవరం వ్యాపారస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిర్రాజ రవి మాట్లాడుతూ వ్యాపారస్తులందరూ ఐక్యమత్యంతో ఉంటూ, వ్యాపారాల్లో వచ్చిన లావాదేవీలు, సమస్యలపై ఐక్యమత్యంతో పోరాడేందుకే ఈ సంఘం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత కొన్ని నెలలుగా ధర్మవరం పట్టు వ్యాపారస్తులకు నగరాలలో రావలసిన బకాయిలను వసూలు చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా నాలుగు నుంచి ఐదు కోట్ల రూపాయల వరకు వివిధ నగరాల నుండి రావాల్సుందన్నారు. వాటిని కూడా వసూలు చేసేందుకు సంఘం కృషి చేస్తోందని చెప్పారు. అక్టోబర్ నెలలో అఖిలభారత వ్యాపారస్తుల అసోసియేషన్ కమిటీ ద్వారా ధర్మవరం వ్యాపారస్తులు దాదాపు 800 మందితో సమావేశాన్ని నిర్వహించి, వ్యాపారస్తుల యొక్క కష్టనష్టాలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. అనంతరం పట్టుసాలే సంఘం వారు, సెమినారాయన స్వామి ఆలయ కమిటీ వారు ధర్మవరం పట్టుచీరల తయారీ వ్యాపారస్తుల సంఘం చేసిన కృషిని అభినందించి కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు కలవల రామకుమార్, పోలా వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు పోలా ప్రభాకర్, రంగం ఆది, తవిసల నాగభూషణం, కార్యదర్శి బెస్త సాంబశివ (దత్త శివ), సహకార్య దర్శులు- కోటం హేమంత్ కుమార్, నీలూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోనేరును సుందరంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-హిందూపురం

గుడ్డం కోనేరును శుభ్రం చేయించి, సర్వ సుందరంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. గత మూడు రోజులుగా వినాయక నిమజ్జనం సందర్భంగా నిమజ్జనం చేసిన కోనేరును మున్సిపల్ సిబ్బంది మంగళవారం శుభ్రం చేశారు. ఈ ప్రక్రియను చైర్‌పర్సన్ ఇంద్రజ పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఈమెతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలను ఆపండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌ను చూపుతున్న అధికారులు

పట్టణంలోని వ్యాపారస్తులు పూర్తిగా ప్లాస్టిక్ విక్రయాలను ఆపివేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఉదయాన్నే పట్టణంలోని పలు షాపులపై దాడులు నిర్వహించారు. పట్టణంలోని సత్య లాడ్జి ఎదురుగా గల షాపులు, పాత సుదర్శన్ కాంప్లెక్స్ దగ్గర గల షాపులు, ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర గల షాపుల్లో తనిఖీ నిర్వహించారు. దాదాపు 15 కేజీల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని 15 వేల రూపాయల జరిమానా విధించారు. ధర్మవరాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలంటే ప్రజలతో పాటు వ్యాపారస్తులు కూడా చేయూత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మహబూబ్ బాషా, శ్యాంసన్, ఏఈ ప్రతాప్, మేస్త్రీలు ఆంజనేయులు, నాగరాజు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్‌కేంద్రాల విభజనపై అఖిలపక్ష సమావేశం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి రెవిన్యూ డివిజనల్ అధికారి భాగ్య రేఖ అధ్యక్షతన పుట్టపర్తి రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో పోలింగ్‌కేంద్రాల పునర్విభజనపై అఖిలపక్ష నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఓబుళదేవరచెరువు మండలంలోని కొండకమర్లలో ఒకే పిఎస్‌లో 15వందల పైబడి ఓటర్లు ఉన్నందున నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు, లోకేషన్ మార్పులు బుక్కపట్నం ఒకటి, పుట్టపర్తి అర్బన్ రెండు, నల్లమాడ,1 ఓ.డీ.సి 1, పేర్లు మార్పులు ఓ.డి.సి నాలుగు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమములో డిఎఒ జిలాని, టిడిపి సామకోటి ఆదినారాయణ, సిపిఎం పైపల్లి గంగాధర్, సిపిఐ ఆంజనేయులు,జనసేన బొగ్గరం శ్రీనివాసులు, బిజెపి బాలగంగాధర్, విజయ భాస్కర్ రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ హరికృష్ణ, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి - మడకశిర

మడకశిరలో ఒకే డ్రస్‌కోడ్‌తో మహిళలు

పట్టణంలో 9 రోజులపాటు ఉచిన వినాయక విగ్రహాలను మంగళవారం ఊరేగింపుగా తీసుకొని వెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మారుతి నగర్ లో శ్రీ అభయ వినాయక సేవా సంఘం సభ్యులు ఒకే డ్రస్ కోడ్ తో గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

గుడిబండ : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసులు మంగళవారం ఘనంగా వినాయక విగ్రహ నిమజ్జనం చేశారు. కాలనీలోనిలక్కమ్మ దేవాలయంలో తొమ్మిది రోజులపాటు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం కాలనీ యువకులు వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిబండ ఎస్సీ కాలనీ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్ క్రీడామైదానంలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో ధర్మవరానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్ఎం బాస్కర్ తెలిపారు. అనంతపురంలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ఇండియా క్రీడాపోటీలలో అండర్-17 విభాగంలో పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాలకు చెందిన మనోజ్‌కుమార్, దయాసాగర్, అండర్ -14 విభాగంలో పోతలయ్య ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం తెలిపారు. వీరిని హెచ్ఎంతోపాటు పీడీ పద్మాబాయి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మడకశిర విద్యార్థుల ప్రతిభ

మడకశిర : తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో సుమన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ వారు నిర్వహించిన 21 జాతీయ స్థాయి కరాటే పోటీలలో మడకశిర విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. మడకశిర కు చెందిన శ్రద్ధ స్కూల్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారు కటాస్ , కుమితే ఈవెంట్లలో జూనియర్ , సీనియర్, విభాగంలో గోల్డ్ , సిల్వర్ , బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారు. ప్రతిభా విద్యార్థులను పాఠశాల చైర్మన్ , ప్రిన్సిపల్, కరాటే మాస్టర్ రామచంద్ర ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

కదిరి అర్బన్ : మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ అంజినప్పమంగళవారం తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై ఇటీవల జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదులు రావడంతో స్పందించిన ఎంపిడిఒ కుమ్మరవాండ్లపలిల అంగన్వాడీ మెయిన్ సెంటరును తనిఖీ చేశారు. పిల్లల హాజరు పట్టిక, సెంటరు రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి వై. పద్మజ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్లు విడుదల

గోరంట్ల : చలో విజయవాడకు సంబందించిన పోస్టర్లను పట్టణంలో అంబేద్కర్ కాలనీలో కెవిపిఎస్ నాయకులు మంగళవారం విడుదల చేశారు ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య మాట్లాడుతూ దళితుల మీద వివిధ రూపాలలో వివక్ష కొనసాగుతోందన్నారు. దళితుల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నా అవి అమలు కావడం లేదని విమర్శించారు. దళితుల సామాజిక న్యాయం కోసం ఈనెల 29న విజయవాడలో జరిగే ధర్నాలో దళితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు గోవిందప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణమండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలం కాలువేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న లక్ష్మీ రంగనాథ స్వామి కళ్యాణ మండపం నిర్మాణానికి తమిళనాడుకు చెందిన దాతలు విరాళం అందజేశారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌కు చెందిన జెఎల్.వేల్ తనవంతుగా 5వేల రూపాయల విరాళాన్ని అందించారు. ఆయన అల్లుడు పదివేల రూపాయలు విరాళం అందించారు. అదే విధంగా వేల్ తమ్ముడు 5వేల రూపాయలు విరాళం అందించారు. వేల్ మనవరాళ్లు కూడా తమవంతుగా 5వందల రూపాయలు అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు రాజన్న, రంగప్ప, తిమ్మప్ప , రమేష్, రంగనాథప్ప, రంగనాథ్ తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

ముదిగుబ్బ : స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎల్ఎం ఉమా మోహన్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు పుస్తకాల అదనపు సౌకర్యం పై ముదిగుబ్బ గ్రంథాలయ అధికారి బొజ్జే నాయక్‌తో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది ఖాదర్‌బాషా, పాఠకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులను సక్రమంగా అందించండి

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ మొబైల్ ఆపరేటర్లు చౌక ధాన్యపు డీలర్లు నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, డిటి స్వాతి తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్‌కార్యాలయంలో మొబైల్ ఆపరేటర్లు, డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డుల లబ్ధిదారుల వేలిముద్రలు సేకరించి సకాలంలో వారికి సరుకులు అందించాలని సూచించారు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరోగ్య సురక్ష సర్వే వందశాతం పూర్తి చేయాలి

గోరంట్ల రూరల్ : ఆరోగ్య సురక్ష సర్వేను వందశాతం పూర్తి చేయాలని ఎంపిడిఒ రఘునాథగుప్త ఆదేశించారు. మండలంలోని కమ్మలవాండ్ల పల్లి, గౌనివారిపల్లి సచివాలయ పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను ఎంపిడిఒ మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయం పరిధిలోని మొత్తం అన్ని కుటుంబాలను కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పూర్తి చేయించాలని ఆదేశించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కదిరి విద్యార్థులు

కదిరి టౌన్ : రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కదిరికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ షెక్షవలి తెలిపారు. అనంతపురం అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఐ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలలో బాక్సింగ్ కోచ్ షేక్షావలి ఆధ్వర్యంలో కదిరి విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీలలో బ్లూ మూన్ కాలేజ్ విద్యార్థినులు అండర్ 19లో 56, 52 కేజీల విభాగంలో పి.సిరి , ఎం.నికితబాయి విజేతలుగా నిలిచారు. అదేవిధంగా స్పేస్ జూనియర్ కాలేజ్ విద్యార్థిని యశస్విని అండర్ 19లో 44, కేజీల విభాగంలో విజేతగా నిలిచింది. వీరు విజయనగరం లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను అనంతపురం,శ్రీ సత్యసాయి ఎస్‌జిఎఫ్ఐ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, కోచ్ ఓం ప్రకాష్, బాక్సింగ్ కోచ్ అక్బర్ అలీ , కాలేజీ నిర్వాహకులు అభినందించారు.

శాశ్వత ఇళ్ల నిర్మాణాలకు సిద్ధం

పేదలతో మాట్లాడుతున్న నాయకులు

చిత్తశుద్ధి ఉంటే ఇక్కడే ఇళ్ల పట్టాలివ్వండి
వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న

ప్రజాశక్తి- చిలమత్తూరు

ప్రభుత్వం అధికారం లోకి వచ్చి నాలుగేళ్ల గడుస్తున్నా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి మూడేళ్ల గడుస్తున్నా ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు కాబట్టే ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలాన్ని పేదలు స్వాధీనం చేసుకున్నారని ఇక్కడ శాశ్వత ఇళ్ల నిర్మాణాలు చేపడతామని వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న, అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వమే లేఅవుట్ వేసి ప్రభుత్వమే లబ్దిదారులను గుర్తించి, పట్టాలు మాత్రం ఎందుకు ఇవ్వడం లేదో అంతు చిక్కని ప్రశ్నగా ఉందని అన్నారు. అధికారుల వైఫల్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదో లేక ప్రభుత్వమే పేదలకు విలువైన భూమిని ఇవ్వొద్దని అధికారులను ఆదేశించిదో అంతు చిక్కడం లేదని అన్నారు. స్థానికంగా ఉన్న పేదలు సెంటున్నర ఇంటి స్థలం కోసం పోరాటం చేస్తుంటే అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా రియాల్టర్లతో కార్యాలయాలలో గంటల కొద్ది సమావేశాలు వేస్తూ కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. చిలమత్తూరు మండలంలో వేల ఎకరాలు సెజ్ పేరుతో బడాబాబులకు అప్పగించిన ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణం కోసం భూమి ఇవ్వమంటే నిర్బంధాలు అరెస్టులు చేసి బయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పుట్టపర్తి జిల్లా వ్యాప్తంగా ఇంటి స్థలాల కోసం పేదలు నడుం బిగిస్తున్నారని చెప్పారు. సోమందేపల్లి నక్కలగుట్ట,పెనుకొండ ప్రాంతంలోని భూమిని స్వాదీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం ,జిల్లా పరిపాలన యంత్రాంగం వెంటనే స్పందించి ఇళ్లు లేని పేదలకు వెంటనే పట్టాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, సిపిఎం నాయకులు సోమందేపల్లి రంగప్ప రమేష్, చంద్ర, ఆనంద్, సదాశివరెడ్డి, నరసింహా, రియాజ్, శివ, హనీఫ్, రఫిక్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

28న శ్రామిక మహిళా జిల్లా సదస్సు : సిఐటియు

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్ వెంకటేష్

ఈనెల 28న గోరంట్లలో చేపట్టే శ్రామిక మహిళా జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ కోరారు.. ఈసందర్భంగా ఆయన గోరంట్ల మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న పేదరికం, కొనుగోలు శక్తి పడిపోవడం తదితర కారణాలతో మహిళలు అనివార్యంగా పనులకు వెళ్లాల్సి వస్తోందన్నారు. పిల్లల పెంపకం, అనారోగ్యం తదితర కారణాలతో కుటుంబాలను కాపాడుకోవడానికి శ్రామిక మహిళలుగా మారుతున్నారన్నారు. సత్యసాయి జిల్లాలోని కియా పరిశ్రమలో వీరి సంఖ్య పెరిగిందన్నారు. టీచర్లు, జర్నలిస్టులు, న్యాయవాదులు, పోలీసు, హోంగార్డు, వ్యవసాయ తదితర అనేక రంగాలలో శ్రామిక మహిళల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కష్టంతో పాటు మహిళలపై వేధింపులు పెరిగాయన్నారు. వీటి అన్నిటిపైనా ఈనెల 28న గోరంట్ల మండల కేంద్రంలోని షాదీమహల్‌లో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రమేష్, పెడబల్లి బాబా, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండలమీట్

పుట్టపర్తి రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన పుట్టపర్తి మండల సర్వసభ్య సమావేశాన్ని అధికారులు ప్రజా ప్రతినిధులు తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈ ఎంపిపి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ అవుటాల రమణారెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయిలోని అధికారులు ఒక్కొక్క శాఖకు ఒక్కొక్కరు హాజరు కావాల్సి ఉండగా రెండు మూడు శాఖలు అధికారులు మాత్రమే హాజరయ్యారు. మండల వ్యాప్తంగా 14 పంచాయతీలు, 8 ఎంపిటీసీలు, ఒక జెడ్పీటీసీ ఉండగా వారిలో కొందరు మాత్రమే హాజరయ్యారు. వచ్చిన సభ్యులు సైతం అధికారులు లేని కారణంగా తమ సమస్యలను చెప్పలేక మిన్నకుండిపోయారు. వెంకటగారి పల్లి సర్పంచి లక్ష్మీదేవి మాట్లాడుతూ అభివృద్ధి చేయాలంటే పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని అధికారులను కోరారు. రాచువారి పల్లి సర్పంచి మాట్లాడుతూ మార్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీకి విద్యుత్తు సరఫరా అవుతోందని దీంతో విద్యార్థులు ప్రమాదాలకు గురి అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు ఆ శాఖకు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పైపల్లి సర్పంచి ప్రవీణ్ మాట్లాడుతూ ఉపాధి పనులు లేక రైతులు రైతు కూలీలు వలస బాట పడుతున్నారని వారికి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అనంతరం పలు శాఖల అధికారులు వారి శాఖల అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకట బ్రహ్మం, ఏఈవో ఆనంద నాయక్, ఉపాధి హామీ ఏవో హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాలో ప్రయివేటు కంపెనీల ప్రవేశం వద్దు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పంటల బీమాలో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రవేశం నిలిపివేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటల బీమాపై ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 660ను రద్దుచేయాలని ఆర్డీవో తిప్పేనాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ.. 2023-24 పంటల బీమాపై ప్రభుత్వం 8-9-2023ర జీవో నెంబర్ 660ను విడుదల చేసిందన్నారు. ఆ జీవోను రద్దుచేయాలని, పంటల బీమాతో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలో ప్రవేశం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేయాలన్నారు. 2023-24 ఖరీఫ్ సీజన్లో పంటల బీమా అమలు కోసం రాష్ట్రప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీతో బిడ్డింగ్ నిర్వహిచిందన్నారు. పంటల బీమా విషయంలో రైతులకు నష్టం కల్గించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు పంటల బీమాను సకాలంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు కొత్తపేట మారుతి, నాయకులు ఎల్.ఆదినారాయణ, ఓబులేసు, బాబు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా
నేడు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ బుధవారం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ చేపట్టిన ధర్నాలో వామపక్ష పార్టీలతో పాటు ప్రజా సంఘాల నాయకులు రైతులు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కదిరి టౌన్ : విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ బుధవారం తలపెట్టిన పుట్టపర్తి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయ ప్రదం చెయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం కదిరి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూభవిష్యత్తులో విద్యుత్తు రంగం పూర్తిగా కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి వెళ తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యమానికి వినియోగదారులు, నాయకులు కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

జైన్ పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన

కదిరి టౌన్ : పట్టణంలోనిబేరిపల్లి కాలనీ వద్ద గల జైన్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులచే సైన్స్‌ఫేర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయగుప్త ప్రారంభించారు. పాఠశాలలో చదువుతున్న 20 మంది చిన్నారులు వివిధ రకాల ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవంపై ర్యాలీ

లేపాక్షి : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మండలం కేంద్రంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నంది విగ్రహం నుండి ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం గురించి అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదని కోరారు. పర్యాటక కేంద్రంగా దేశంలోనే లేపాక్షికి ఉత్తమ అవార్డును ప్రకటించారన్నారు. ఢిల్లీ లో ఉత్తమ పర్యాటక గ్రామం అవార్డు తీసుకోవడానికి పంచాయతీ ప్రెసిడెంట్ ఆదినారాయణ పర్యాటక సిబ్బంది డిల్లీకి వెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, ఎంపీడీవో నరసింహ నాయుడు, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, వైసిపి నాయకులు నారాయణ స్వామి, ఈవోఆర్డీ శివన్న, వైస్ ఎంపీపీ అంజనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నాయకులు

గుర్తింపు ఇవ్వడం అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి నాయకుడు నరేష్‌ను అధిష్టానం గుర్తించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. పట్టణానికి చెందిన వాల్మికి నరేష్‌ను వైసిపి బి బ్లాక్ కన్వీనర్‌గా నియమించారు. దీంతో మంగళవారం పలువురు నరేష్‌ను కలిసి పుష్పగుచ్చాలు అందించి శాలువాలు కప్పి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంతే బిదనూర్ మాజీ సర్పంచి రామాంజనేయులు, కిరికెర మాజీ సింగల్ విండో అధ్యక్షులు బసప్ప, శ్రీనివాస ప్రాపర్టీ అండ్ డెవలపర్స్ ఆఫీస్ సిబ్బంది, హస్నాబాద్‌కు చెందిన దినేష్, కార్తీక్, అఖిల్, తేజ, వంశి, మధు, వేణు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కదిరిలో దొంగల బీభత్సం

40 తులాల బంగారు, రూ. 2.35 లక్షల నగదు చోరీ

కదిరి టౌన్ : కదిరి పట్టణం అడపాల వీధి పంచాయతీరాజ్ ఆఫీస్ వెనుక వీధిలో సోమవారం అర్ధరాత్రి మూడు నివాసాలలో చోరీలకు పాల్పడిన దొంగలు బీభత్సవం సృష్టించారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు.. పంచాయతీరాజ్‌కార్యాలయానికి సమీపాన నివాసముండే ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుడు పార్నపల్లి ప్రసాద్, ఆయన భార్య ఇందిరమ్మ తమ కుమారుడు కోడలు తో కలిసి జమ్మలమడుగు లోని బంధువుల ఇంటికి వెళ్లారు. అదేవిధంగా ఎదురు ఇంట్లో నివాసం ఉండే గుణశేఖర్ రెడ్డి కుటుంబంతో కలిసి షిరిడీకి వెళ్లారు. పక్క ఇంట్లో నివసిస్తున్న చంద్రశేఖర్ కాంతమ్మ దంపతులు శుభకార్యం కోసం పులివెందులలోని కుమార్తె ఇంటికి వెళ్లారు. ఈ ఇళ్లలో ఎవరు లేకపోవడం, ఇంటికి తాళాలు వేసి ఉండటాన్ని పసి కట్టిన దుండగులు సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మూడు ఇళ్లల్లోకి చొరబడి వరుస చోరీలకు పాల్పడ్డారు. ప్రసాద్ ఇంట్లో రెండు బీరువాలు పగలగొట్టి ఆరోగ్యం కోసం ఉంచిన రెండు లక్షల రూపాయల నగదు, 25 తులాల బంగారు దోచుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. పక్క ఇంట్లో నివసిస్తున్న చంద్రశేఖర్ నివాసంలో చొరబడి రెండు తులాల బంగారు, 35 వేల నగదు దోచుకెళ్లారు. అదేవిధంగా ఎదురింట్లో నివసిస్తున్న గుణశేఖర్ రెడ్డి ఇంట్లోకి చొరబడి పది తులాల బంగారు, ద్విచక్ర వాహనం దొంగలించినట్లు వారి బంధువులు తెలిపారు. ఒకే వీధిలో అర్ధరాత్రి సమయంలో దొంగలు తాళాలు పగలగొట్టి వరుసగా మూడు ఇళ్లల్లోకి చొరబడి చోరీలకు పాల్పడడంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుస చోరీలు ఘటన తెలుసుకున్న పట్టణ ఇన్‌ఛార్జి సిఐ సూర్యనారాయణ ,ఎస్ఐ బాబ్జాన్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి చోరీల జరిగిన మూడు నివాసాలలోను పరిసర ప్రాంతాలను తనికీ చేయించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్కాబీటర్లు అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కదిరిగేటు సమీపంలో మట్కా నిర్వహిసున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ధర్మవరం సెబ్ సిఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం మట్కా నిర్వాహకుల అరెస్టు వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పట్టణంలోని కదిరిగేటు వద్ద మట్కా నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారం రావడంతో తాను సిబ్బందితో వెళ్లి మట్కా నిర్వహిస్తున్న రామాంజనేయులు, లింగమయ్య,భద్రాచారీలను అరెస్టు చేసినట్లు సిఐ చెప్పారు. వద్దనుండి వారి రెండు సెల్‌ఫోన్లు, 11 మట్కాస్లిప్పులు, రూ.10,770ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుడిబండ: మండల కేంద్రంలోని ఏడీసీసీ బ్యాంక్ ఎదురుగా ఓ మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇతని కోసం ఇంతవరకు ఎవరు రాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు పరిగణించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఆకతాయిలపై ఫిర్యాదు

లేపాక్షి : మండలంలోని కంచిసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థినులను వేధిస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం లేపాక్షి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థినులకు అకతాయిలు గత కొద్ది రోజులుగా వేధిస్తుండడంతో స్థానికులు మంగళవారం బుద్ధి చెప్పడానికి ప్రయత్నించగా వారిపై దాడి చేశారని వాపోయారు.

బిజెపి ఎంపీ వ్యాఖ్యలు దుర్మార్గం

ప్రజాశక్తి-హిందూపురం

పార్లమెంట్ సాక్షిగా మతం పేరుతో ఒక ముస్లీం మైనార్టీ ఎంపీ డానిష్ అలిని టెర్రరిస్టుగా సంబోదించిన బిజెపి ఎంపీ రమేష్ సభ్యత్వాన్ని రద్దు చేసి పార్లమెంట్ నుంచి బహిష్కరించాలని బిఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. బిజెపి ఎంపీ వ్యాఖ్యలను వారు ఖండిస్తు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఎస్‌పి రాష్ట్ర నాయకులు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి కుమార్ మాట్లాడుతు గల్లీలో ఉన్నా మతోన్మాదం నేడు పార్లమెంట్ వరకు విస్తరించిందన్నారు. దేశాన్ని మతం పేరుతో విభజించడానికి బిజెపి సిద్ధం అవుతున్నాదన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నియోజక వర్గ అధ్యక్షులు నాజీంబాషా, నాయకులు సుబ్బరాయప్ప, నారాయణ, చిరంజీవి, చంద్రశేఖర్, గంగప్ప, అంజినప్ప, ఫక్రుద్దీన్, రఫీక్, హనీఫ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సిఐగా నారాయణ రెడ్డి

కదిరి టౌన్ : కదిరి పట్టణ సిఐ గా నారాయణ రెడ్డిని నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నారాయణ రెడ్డి కర్నూల్ జిల్లా కోవెల కుంట్ల సిఐ గా పనిచేస్తూ బదిలీపై కదిరి వస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలో దేశ విదేశీ భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు నడుంబిగించారు. నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన సి కొండారెడ్డి సిబ్బందితో కలిసి మంగళవారం పట్టణంలో కలియ తిరుగుతూ స్వయంగా దుకాణదారులతో మాట్లాడి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా సరే రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తే జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పుట్టపర్తి జిల్లా కేంద్రం కావడంతో నిత్యం జన సంచారం అధికంగా ఉందని, అందుకు అనుగుణంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రజలందరూ సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు ఎక్కడ పడితే అక్కడ నిలిపితే కేసులు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని సిఐ హెచ్చరించారు.

రాష్ట్రంలో రాక్షసపాలన : టిడిపి

పెనుకొండలో దీక్ష చేస్తున్న సవితమ్మ

రొద్దంలోని దీక్షలో మాట్లాడుతున్న బికె

పుట్టపర్తిలో పల్లె, తదితరుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని ఎన్ టి ఆర్ సర్కిల్‌లోని తన కార్యాలయం వద్ద రెండవ రోజు ఆమరణ నిరాహార దీక్షను సవితమ్మ కొనసాగించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న, చంద్రదండు ప్రకాష్ నాయుడు తదితరులు ఆమెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ లేని కేసులో చంద్రబాబు నాయుడు ని అరెస్ట్ చేసిన జగన్ ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోందన్నారు. రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా కదిరి పట్టణం లో టిడిపి కదిరి నియోజవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు .ఈ రిలే నిరాహార దీక్షలకు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి నాగన్న మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలనకు అంతిమ రోజులు దగ్గర పడ్డాయన్నారు.

గుడిబండ : చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టుకు నిరసనగా మడకశిర నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లుదాదాపు పది కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి కక్షపూరిత రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గం టిడిపి పరిశీలకులు పులివెందుల పార్థసారథి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, గుడిబండ మండల కన్వీనర్ మ ద్దనకుంటప్ప, జిల్లా వీరశైవ సాధికార కన్వీనర్ దుర్గేష్, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి సురేష్, మాజీ ఆసుపత్రి కమిటీ చైర్మన్ శివకుమార్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఆయన అనుచరులు పట్టణంలోని 35వ వార్డులో పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు పోస్టుకార్డులపై ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకుల దుస్సాక్రిష్ణ, గంధమనేని నారాయణస్వామి, మల్లికార్జున, జయరాములు, చౌడప్ప, వీరభద్రప్ప, సయ్యద్ బాబా,. రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆయన సతీమణి కమలమ్మ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట మహిళలు 14వ రోజు సామూహిక రిలే నిరాహారదీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, సత్య సాయి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, పెనుగొండ నియోజకవర్గం అధ్యక్షులు చిన్నప్పయ్య, రొద్దం మాజీ సర్పంచి అశ్వర్థ నారాయణ మహిళలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ముఖ్యమంత్రి జగన్ అన్ని వర్గాల ప్రజలను మోసగించారని టీడీపీ నాయకులు విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ దీక్షల్లో టీడీపీ నాయకులు చీమల రామాంజి. అడ్రమహేశ్, వెంకటేశ్వర్లు, కత్తులబాబ్జి, బత్తలగంగాధర్, బీరే శీన, మాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పైశాచిక ఆనందం కోసమే చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేసిందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మి అన్నారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా పట్టణంలో చేపట్టిన దీక్షలు 14వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం చేపట్టిన దీక్షల్లో తెలుగు మహిళలు కళ్లకు నల్ల టేపు కట్టుకుని నిరసన తెలిపారు. ం. మహిళలు చేపట్టిన దీక్షను సాయంత్రం సీనియర్ నాయకులు నాగరాజు, పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్‌లు నిమ్మరసం ఇచ్చి విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామాంజినమ్మ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, పట్టణ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కౌన్సిలర్లు మంజుళ, భారతి, మహాలక్ష్మి, పార్లమెంట్ రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి, పార్లమెంట్ కార్యదర్శి చెన్నమ్మ, గీతమ్మ, నాగమణి, లక్ష్మీదేవి, అరుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 14వ రోజుకు చేరాయి. మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ బాబు విడుదల అయ్యేవరకు తమ పోరాటాలు ఆగదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, శ్రీరామ్ రెడ్డి, అంబులెన్స్ రమేష్, పేపర్ గంగాద్రి, టిడిపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సాయంత్రం కొవ్వొత్తులతో శాంతి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు దేవేందర్ నాథ్ రెడ్డి , నారాయణస్వామి, లక్ష్మీనారాయణ , బాల భాస్కర్ ,రెడ్డప్ప , సురేష్ రెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : చంద్రబాబు నాయుడు వెన్నంటే బీసీ కులాలు ఉన్నాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ కందికుంట ఆధ్వర్యంలో పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 17వ రోజు కొనసాగాయి. నియోజకవర్గం నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు ఈసందర్భంగా తమ సంఘీభావం ప్రకటించారు.